క్లుప్తంగా

సామూహిక సీమంతాలు



సీమంతం చేస్తున్న సర్పంచ్ తదితరులు

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి అంగన్‌వాడీకేంద్రంలో పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. తల్లులకు, కిషోర బాలికలకు మిల్లెట్‌ఫుడ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఏసీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ గంగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు అఖిల, జ్యోతి, విజయ, శారద, హెచ్‌ఎంలు ఎస్‌ఎంసీ చైర్మన్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, కిషోరబాలికలు పాల్గొన్నారు.

సరస్వతీ శిశుమందిర్‌లో వార్షికోత్సవ సంబురం



కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

వేములవాడ: వేములవాడలోని సరస్వతీ శిశు మందిర్ 43వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, పాఠశాల ప్రధానాచార్యులు చిలుకగట్టు, పాఠశాల కమిటీ, విద్యార్థులు,అధ్యాపకులుపాల్గొన్నారు.

మెడికల్ కిట్లు పంపిణీ



కిట్లు అందిస్తున్న ఆయుష్ ఉద్యోగులు

ముస్తాబాద్: మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో ఆయుష్ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో బాలికలకు హెల్త్‌కిట్లను శనివారం పంపిణీచేశారు. వ్యక్తిగత శుభ్రత ఆరోగ్య సూత్రాలు తెలిపారు. పౌష్టికాహారంతో కలిగే లాభాలు వివరించారు. బాలికలకు రాగి లడ్డులు అందించారు. ప్రభుత్వం అందిస్తున్న హెల్త్‌కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకాధికారి శ్రీలత, ఆయుష్ ఫార్మసిస్ట్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్టు సభ్యులు

వేములవాడరూరల్: మండలంలోని చెక్కపల్లికి చెందిన మహ్మద్ అక్బర్‌పాషా, అతని కుమారుడు చాంద్‌పాషా కొన్నిరోజులుగా బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆసుపత్రిలో ఆపరేషన్ కోసం వెళ్లగా రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించడంతో ఆర్థికస్తోమత లేక ఇంటి వద్దే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న మైహోం ట్రస్టు సభ్యులు ముందుకు వచ్చి దాతల సహకారంతో చాంద్‌పాషాకు రూ.10వేలు అందించారు. దాతలు ముందుకు వచ్చి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అబ్దుల్‌జఫర్, మధుమహేశ్, రవీందర్, గొంగళ్ల రవికుమార్, పాత సంతోశ్, రఫీక్, రజాక్, రాజు, చంద్రశేఖర్ ఉన్నారు.

బీరప్ప ఉత్సవాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న ఒగ్గుడోలు కళాకారులు

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లిలో బీరప్ప ఉత్సవాలను కులస్తులు ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో మహంకాళి అమ్మవారికి గంగస్నానం చేయించి ఆలయంలో ప్రతిష్ఠించారు. బీరప్ప ఆటపాటలతో గొల్లకురుమలు ఘనంగా పండుగ జరుపుకున్నారు. కులపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

నర్సరీ పరిశీలన

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని హరిత నర్సరీని శనివారం ఏపీఓ చంద్రయ్య పరిశీలించారు. వేసవి దృష్ట్యా మొక్కలకు ఎండతగలకుండా షెడ్‌నెట్లు ఏర్పాటుచేయాలని కోరారు. వచ్చే జూన్ చివరినాటికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలన్నారు. రోజుకు రెండుసార్లు నీళ్లు పట్టాలని నిర్వాహకులకు సూచించారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూపరాణి



సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

- రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపరాణి
- సమస్యలపై అధికారులను ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు
- సాదాసీదాగా సాగిన మండల సభ

రుద్రంగి: మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపరాణి పేర్కొన్నారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. అధికారులు మూడునెలల ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరై చదివి వినిపించారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. మూడు నెలల క్రితం సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను ఇప్పటి వరకు అధికారులు పరిష్కరించలేదని, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అభివృద్ధి పనులతో అప్పుల పాలు..

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు రాక తీవ్రఇబ్బందులు పడుతున్నామని, అప్పులు చేసి పనులు చేశామని, ఏళ్లతరబడిగా చేసిన పనులకు బిల్లులురాక లక్షల్లో అప్పుల పాలయ్యామని రుద్రంగి, అడ్డబోర్ తండా గ్రామాల సర్పంచులు తర్రె ప్రభలత, మోహన్ ఆవేదన వ్యక్తంచేశారు. పీఆర్ ఏఈ మనోహర్ సమాధానమిస్తూ ఈజీఎస్ నిధులు రాలేదని, అయినప్పటికీ బిల్లులు చెల్లించామన్నారు.

సభలో చర్చకు వచ్చిన సమస్యలు...

మానాల గ్రామంలో, పాఠశాలల్లో మిషన్ భగీరథ నీళ్లురాక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని మానాల సర్పంచ్ అల్లూరి మానస, అడ్డబోర్‌తండా సర్పంచ్ మోహన్ సభాదృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్య తలెత్తడంతో తన రెండెకరాల పొలం వదిలేసి బోరుబావి నీటిని ట్యాంకర్లతో గ్రామంలో ప్రజలకు తాగునీరందిస్తున్నట్లు సర్పంచ్ మానస ఆవేదన వ్యక్తంచేశారు. అడ్డబోర్‌తండా స్కూల్ బిల్డింగ్‌పైనున్న విద్యుత్ వైర్లను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా, పత్రికల్లో కథనాలు ప్రచురించినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ మోహన్ సభలో ఆగ్రహం వ్యక్తంచేశారు. సభాదృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, సభలో సమస్యలు ప్రస్తావించడం కూడా వృథాయేనని ఊరికే వచ్చివెళ్తున్నామని అసహనం వ్యక్తంచేశారు. అద్దెభవనాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో ఇబ్బందులు పడుతున్నామని సొంత భవనాలు నిర్మించాలని కోరగా స్థలం చూపిస్తే భవనాలు నిర్మిస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత సూచించారు. రుద్రంగి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆహ్వానించి ప్రొటోకాల్ పాటించకుండా అవమానించారని రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత ఆరోపించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత ఆధ్వర్యంలో మహిళలు, బాలింతలు, చిన్నారులు రక్తహీనతపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం సర్వసభ్య సమావేశంకు హాజరైన మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞచేశారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాశ్ పురష్కార్ అవార్డులను రుద్రంగి మండల సర్పంచులు, కార్యదర్శులకు అందించి వారిని సభకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రుద్రంగి ఎంపీడీవో మాలోత్ శంకర్, ఎంపీవో సుధాకర్, ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, సనుగుల పీఏసీఎస్ చైర్మన్ జలగం కిషన్‌రావు, వైస్‌ఎంపీపీ పీసరి చిన్నభూమయ్య, ఎంపీటీసీలు, కోఆప్షన్‌సభ్యులు, అన్ని గ్రామాల సర్పంచులు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో యువత ముందుండాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సర్పంచ్

వేములవాడరూరల్: చదువుతో పాటు సామాజిక సేవలో యువత ముందుండాలని సర్పంచ్ స్వయం ప్రభ అన్నారు. మారుపాక గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ బాలికల ప్రోగ్రాం డా.రమాదేవి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేశామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈనెల 25నుంచి 31 వరకు గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డుమెంబర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం

గంభీరావుపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం జాతీయ సేవా పథకంలో భాగంగా నర్మాలకు తరలివెళ్లారు. నర్మాల గ్రామంలో వారం రోజులు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాలు చేపడతారని కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. శ్రమదానంతో పాటు ప్రజలను చైతన్యపరిచేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సామాజిక, ఆర్థిక విషయాలను పరిశీలిస్తారన్నారు. సర్పంచ్ ఎడబోయిన రాజు, ప్రోగాం ఆఫీసర్ ధర్మపురి, ఉపసర్పంచ్ శోభరాణి, ఎంపీటీసీ బాలమణి, కార్యదర్శి దత్తు, అధ్యాపకులు పాల్గొన్నారు.

షీ టీం, పోలీస్ సేవలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం ఎస్సై ప్రేమ్‌దీప్

రుద్రంగి: మహిళలు, విద్యార్థినులు షీటీం, పోలీస్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని రుద్రంగి, షీటీం ఎస్సైలు ప్రభాకర్, ప్రేమ్‌దీప్, చైల్డ్‌హెల్ప్‌లైన్ జిల్లా ఇన్‌చార్జి రేణుక పేర్కొన్నారు. మండలకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే షీటీం వాట్సప్ నంబర్: 8712656425కు సమాచారం ఇవ్వాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్: 1098కు చిన్నారుల సమస్యలపై సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రుద్రంగి ఎస్సై ప్రభాకర్, షీటీం ఎస్సై ప్రేమ్‌దీప్, పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రం గంగ నర్సయ్య, పడాల సురేశ్, ఉపాధ్యాయబృందం, 6 నుంచి 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు.

ఉత్తమ గ్రామపంచాయతీగా గూడెం



సర్పంచ్ సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవోలు

ముస్తాబాద్: మండలం గూడెం గ్రామపంచాయతీ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ అవార్డును అందుకుంది. ఈ మేరకు ముస్తాబాద్‌లో ఉత్తమ సర్పంచ్‌గా ఎన్నికైన చిట్నేని సరితను శనివారం సన్మానించి, అవార్డు అందించారు. గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా జీపీ పాలకవర్గం కృషిచేసిందని ఎంపీపీ పేర్కొన్నారు. 2021-22 సంవత్సరానికి గాను కేంద్రప్రభుత్వం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ సతత్ వికాస్ పురస్కారాన్ని గూడెం గ్రామానికి అందించిందని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. అవార్డు అందుకున్న సర్పంచ్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఈ పంచాయతీ ఆపరేటర్లకు సన్మానం

బోయినపల్లి: జాతీయ పంచాయతీ అవార్డుల్లో భాగంగా అవార్డులు పొందిన ఈ పంచాయతీ ఆపరేటర్లు గౌతం, ఆనంద్, నరేందర్‌ను శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఎంపీఓ ఏ.గంగాతిలక్, ఆరీఫ్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం





ముస్తాబాద్/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటువేయడాన్ని నిరసిస్తూ ముస్తాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో, తంగళ్లపల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని) ఆధ్వర్యంలో, ఎల్లారెడ్డిపేట పాతబస్టాండ్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో ధర్నా,రాస్తారోకో నిర్వహించి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

పంటనష్టంపై అధికారుల సర్వే



రుద్రంగి: పంట నష్టంపై సర్వేచేయకుండానే కొంత మంది రైతుల పేర్లను నామమాత్రంగా లిస్టులో పేర్లు నమోదు చేసి నివేదిక పంపించారని రుద్రంగి మండలకేంద్రంలోని రైతులు ఆరోపించడంతో శనివారం 'సాక్షి'లో పంటల సర్వే నామమాత్రమే శీర్షిక ప్రచురించడంతో స్పందించిన వ్యవసాయశాఖ అధికారులు శనివారం వేములవాడ ఏడీఏ భాస్కర్, సైంటిస్టు రాజేంద్రప్రసాద్ ఏవోలతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. మండల ఇన్‌చార్జి ఏవో వెంకటరామమ్మ, రైతులు ఉన్నారు.

క్లుప్తంగా..

హనుమాన్ ఆలయంలో రైతుల ముడుపులు

ఎల్లారెడ్డిపేట: వడగళ్ల వానలు పడొద్దని ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని శ్రీ అంజనేయస్వామి ఆలయంలో శనివారం రైతులు పూజలు చేసి ముడుపుకట్టారు. రైతులు వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, బాల్‌రాజ్‌యాదవ్, చందుపట్ల లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, యమగొండ కిష్టారెడ్డి, పారిపల్లి రాంరెడ్డి, సంజీవరెడ్డి, అర్చకులు దయానంద్‌శర్మ పాల్గొన్నారు.

మంత్రి పర్యటన విజయవంతం చేయాలి

వేములవాడ: సిరిసిల్ల పట్టణంలో ఈనెల 27న మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి వేములవాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు కోరారు. శనివారం ముఖ్య కార్యకర్తలతో మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

బోయినపల్లి: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆయన వెంట ఎస్సై పర్శరామ్, ఏఎస్సై చంద్రమౌళి పాల్గొన్నారు.

సిరి ధాన్యాలపై అవగాహన

వేములవాడరూరల్: వేములవాడ అర్బన్ ఉజ్వల స్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లు సిరి ధాన్యాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ సరస్వతీ, కృష్ణకుమారి, శ్రీవాణి, నాగజ్యోతి, మణె మ్మ, సరోజన, శోభారాణి, భారతి ఉన్నారు.

తైబజార్ వేలం

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని కూరగాయ మార్కెట్ (తైబజార్), పశువుల అంగడి నిర్వహించేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. 2023-24 ఏడాది పాటు నిర్వాహణకు ఈనె 29న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు కూరగాయల మార్కెట్ నిర్వహణకు రూ.3లక్షల డీడీ, రూ.25లక్షల పూచీకత్తు పత్రం, పశువుల అంగడికి రూ.2లక్షల డీడీతో పాటు రూ. 5లక్షల పూచీకత్తు పత్రం అందించాలన్నారు.

రూ. లక్ష రుణమాఫీ చేయాలి

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ 2018 ఎన్నికల్లో రైతు రుణమాఫీ లక్ష వరకు చేస్తామని హామీఇచ్చి ఇప్పుడు రూ.90వేలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించడం సరికాదని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మ్యాకల మల్లేశం పేర్కొన్నారు. లక్ష రుణమాఫీచేయాలని, లేనిపక్షంలో రైతులు రాబోయే రోజుల్లో గుణపాఠం చెబుతారన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

సిరిసిల్లటౌన్: వేసవి దృష్ట్యా సిరిసిల్ల డిపోమేనేజర్ ఆర్టీసీ సిబ్బందితో పాటు ప్రయాణికులకు శనివారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ రవిగౌడ్, ఎస్టీఐ సారయ్య, కంట్రోలర్ గాలయ్య, ఏడీసీ రాంరెడ్డి, పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి రైతువేదికలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం జగిత్యాల, ఏరుకవాక కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ భాగస్వామ్య విశ్లేషాణాత్మక మూల్యాంకన అంశాలపై చిత్రపటాలు వేసి వాటి ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిలివేరి ప్రసూన, వెంకటరాములు, సాయిలు, సూర్యరావు, బాబు, అంజయ్య, పోచయ్య, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ప్రణీత, సాయితేజస్విని, రుచిత, సాయిశ్రీజ, రజిత, శివాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే 'సహకార' లక్ష్యం



మాట్లాడుతున్న సుధీర్‌రావు

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘం పనిచేస్తోందని, సంఘం అభివృద్ధికి అందరూ సహకరించాలని సింగిల్‌విండో చైర్మన్ రామగిరి సుధీర్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ ప్రాథమిక సహకార సంఘం జనసభ శనివారం చైర్మన్ సుధీర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. సంఘం పరిధిలోని రైతులకు రూ.1.85కోట్ల దీర్ఘకాలిక, రూ.50లక్షలు స్వల్పకాలిక రుణాలు అందించామన్నారు. రైతులకు రుణాలతో పాటు వారు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించామన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. ఎరువుల కొరతలేకుండా గ్రామాల్లోనే రైతులకు అందించామన్నారు. రైతులు సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. సమావేశంలో డైరెక్టర్లు లక్ష్మణ్, సత్తిరెడ్డి, నరహరి, శ్రీరాం, సర్పంచ్ పడిగెల రవీందర్, ఎంపీటీసీ వరదబాబు, సీఈవో కొండ శశివర్దన్, రైతులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



సర్టిఫికెట్లు పొందిన వారితో వికాస్, దీప దంపతులు

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లోని యువత వృత్తివిద్యలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ప్రతిమ ఆస్పత్రి బాధ్యులు డాక్టర్ చెన్నమనేని వికాస్–దీప దంపతులు కోరారు. నాగారంలోని జీవిమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్‌లో టైలరింగ్, హోం హెల్త్ ఏయిడ్, ఎలక్ట్రీషియన్‌లో శిక్షణపొందిన యువతీ యువకులకు సర్టిఫికెట్లు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత వృత్తిశిక్షణలో నైపుణ్యం పెంపొందించుకునేందుకే ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధిని పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ బాధ్యులు కౌశిక్, గీతారెడ్డి, ప్రిన్సిపాల్ మహేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట: ఆపద సమయంలో సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలా మారిందని సర్పంచ్ నిమ్మ లక్ష్మి అన్నారు.ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో శనివారం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆపదలో ఉన్నవారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రాణాలు నిలబెట్టుకోవాలన్నారు. ఎంపీటీసీ సుల్తాన, నాయకులు క్రాంతి, అంబటి పద్మ, అనిల్, సాయి, నిమ్మ మల్లారెడ్డి, నరేందర్, శంకర్‌రెడ్డి, కిషన్, హన్మండ్లు, బాలయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ..

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేట గ్రామంలో శనివారం పలువురు లబ్ధిదారులకు సర్పంచ్ నీరటి లక్ష్మి ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్‌ఎంపీపీ జంగిటి అంజయ్య, బీఆర్‌ఎస్ నాయకులు నీరటి బాబు, మరికంటి నారాయణ, పొన్నం శంకర్, కంకణాల దేవరాజు, బల్లెపు ప్రశాంత్, శ్రీనివాస్, నారాయణ, బాలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: నిరుపేద, మధ్యతరగతి వర్గాలకు కల్యాణలక్ష్మి పథకం వరంలాంటిదని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. ముస్తాబాద్ మండల పరిషత్‌లో 57 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం పంపిణీచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సయ్య, సెస్‌డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, ఎంపీడీవో రమాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ శ్రీ అంజనేయస్వామి ఆలయం 13వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ ఇల్లందుల గీతాంజలి, సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మర్రిపల్లి వేణుగోపాలాచార్యులు శనివారం తెలిపారు. స్వామివారి కల్యాణంలో ప్రత్యేకపూజలు అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

28న హుండీ లెక్కింపు

వేములవాడ: వేములవాడ రాజన్న హుండీ ఆదాయాన్ని ఈనెల 28న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ శనివారం తెలిపారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని ఉత్తర్వులు జారీచేశారు.

హనుమాన్ స్వాములకు అన్నదానం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి డబుల్ బెడ్రూం (కేసీఆర్ నగర్)లో శనివారం హనుమాన్ మాలదారులకు జెడ్పీటీసీ పూర్మాని మంజుల ఆధ్వర్యంలో బిక్ష (అన్నదానం) నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని లింగారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లం యాదవ్, చక్రపాణి, హనుమాన్ మాలదారులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగడ్డ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



పిండి పదార్థాలతో తయారు చేసిన వంటలను తిలకిస్తున్న విద్యార్థులు



చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ ఎస్సీకాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ వేడుకలను జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంపతి రమేశ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వివిధ రకాల పిండి పదార్థాలతో తయారు చేసిన ఆహార పదార్థాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. దేశంలోని భౌ గోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజల ఆహారపు అలవాట్లు ఉంటాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతప్రజలు అంబలి,సర్వపిండి, సకినాలు, కుడుములు, ఉప్పుడిపిండి, పచ్చిపులుసు, బెల్లపు అన్నం జొన్న, మక్కరొట్టెలు, పలు రకాల వంటలను భుజి స్తారని వంటలను విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేణుక, అఖిల తదితరులు పాల్గొన్నారు.